క్లుప్తంగా

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వై. సుజనా చౌదరి ఆధ్వర్యంలో కోల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ ప్రాజెక్ట్ కింద రోటరీ జిల్లా (3020) నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ తరగతుల్లో శిక్షణ తీసుకున్న మహిళలకు అధునాతన హై లాక్ కుట్టు మిషన్లు అందచేశారు. భవానీపురం శివాలయం సెంటర్‌లోని కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడారు. మహిళలకు మిషన్‌పై కుట్టు నేర్పడంతోపాటు కుట్టు మిషన్లు అందించి ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. మహిళలు ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్లమీద తాము నిలబడి కుటుంబాన్ని పోషించుకునేలా చెయ్యటమే తమ లక్ష్యం అన్నారు. మహిళా సాధికారత ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకులు నాగుల్‌మీరా, బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టీటీ పోటీల్లో క్రీడాకారులు సత్తా



విజయవాడస్పోర్ట్స్: రాజమహేంద్రవరంలో ఈ నెల 12,13,14 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు పి.శ్రీకరలాస్య, జె.సుహాస్ బాబు సత్తా చాటారు. అండర్-11 విభాగంలో శ్రీకరలాస్య బ్రాంజ్ మెడల్‌ను, అండర్-13 విభాగంలో సుహాస్‌బాబు బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన చిన్నారులను ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, కబడ్డీ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి కె.పి.రావు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం అభినందించారు. ఇరువురు క్రీడాకారులు శాప్ కోచ్ ముంతాజ్ బేగం వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

ఆకట్టుకున్న సూత్రా ఎగ్జిబిషన్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దేశంలోని నలుమూలల నుంచి ఎంపిక చేసిన విభిన్న రకాల డిజైనర్ల వస్త్రాలు, ఆభరణాలతో విజయవాడ బందరురోడ్డులోని శేషసాయి కళ్యాణ మండపంలో సోమవారం ప్రారంభమైన సూత్రా ఎగ్జిబిషన్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్ మంగళవారం కూడా కొనసాగుతుంది. ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, నాగపూర్, రాయపూర్, ఉజ్జయిని, భోపాల్, గోవా, బెంగళూరు మొదలైన నగరాల నుంచి తెచ్చిన దుస్తులు, సౌందర్య సాధనాలు, గృహ అలంకరణ, సామగ్రి, గిఫ్ట్ ఆర్టికల్స్, దుస్తులు, లైఫ్ స్టయిల్ బ్రాండ్లను ఈ ప్రదర్శనలో నగర వాసులకు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా నిలిచే మోడరన్ దుస్తులు ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

శాస్త్ర సాంకేతికతతోనే దేశాభివృద్ధి సాధ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని పరిశోధనలు చేయటం ద్వారానే భారత దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆకర్ష ఫౌండేషన్ ప్రెసిడెంట్, ఫిజియాలజిస్ట్ డాక్టర్ గర్రె శంకర రావు పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (భారత ప్రభుత్వ సంస్థ), ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రోత్సహించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే దేశంలో ఆమోదించబడిన వివిధ శాస్త్రీయ ప్రాజెక్ట్‌లకు సైన్స్ అండ్ టెక్నాలజీ నిధులను సమకూరుస్తుందని చెప్పారు. వివిధ రంగాల్లో ప్రయోగాత్మక పనులకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సైన్స్ విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటర్నేషనల్ ఆఫ్ థింగ్స్ హెల్త్ హైజిన్, ఆస్ట్రో ఫిజిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. బిగ్ బ్యాంగ్ థియరీ గురించి వివరించారు. టెక్నాలజీపై లఘు చిత్రాలు, ఐటీటీ సెన్సార్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సైకాలజిస్ట్ గాయత్రి, డీ సాయి సతీష్, ట్రైనర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగభృతి కోసం ఎదురు చూపులు

- నెలకు రూ.3 వేలు ఇస్తానన్న కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా స్పష్టత ఇవ్వని వైనం
- 2014లో మొండి చెయ్యి చూపిన చంద్రబాబు
- ప్రస్తుతం మళ్లీ అదే పునరావృతం అవుతుందని సందేహం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి కుటుంబం నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తుంది. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని లేకుంటే మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి పథకానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటన చేయకపోవటంతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా కోసం పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగులు ఉద్యోగం లేదా భృతి ఇస్తానన్న ప్రభుత్వ ప్రకటన గురించి ఆతృతగా ఉన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియోజకవర్గానికి వచ్చి నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో తమ కూటమికి ఓటు వేసి గెలిపిస్తే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని చాలా స్పష్టంగా చెప్పారు.

నియోజకవర్గంలో ఎదురు చూస్తున్న లక్ష కుటుంబాలు

పశ్చిమ నియోజకవర్గంలో సుమారు మూడు లక్షల 80 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సుమారుగా 1.30 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. అదే విధంగా నియోజకవర్గంలో సుమారుగా 1.11 లక్షల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లుగా నివేదికలు చెబుతున్నాయి. వారికి తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. వీరంతా నిరుద్యోగ భృతికి అర్హులే. వీరిలో సుమారుగా లక్ష కుటుంబాలకు చెందిన యువత నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు కూటమి ఎన్నికల్లో ప్రతి కుటుంబానికి ఉద్యోగాన్ని ఇప్పిస్తానని లేదా నిరుద్యోగ భృతిని ఆ కుటుంబంలోని యువతకు అందిస్తామని ప్రకటించింది. దాంతో ఆ కుటుంబాలన్నీ నెలకు మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందా ? అని ఎదురు చూస్తున్నారు.

2014లో మోసం చేసిన చంద్రబాబు

2014లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిని అందిస్తామని చాలా ఆర్భాటంగా ప్రకటించింది. ఆ తరువాత ఐదు సంవత్సరాల పరిపాలనలో చంద్రబాబు దాని ఊసే ఎత్తిన పాపాన పోలేదు. అదేవిధంగా 2024 ఎన్నికల్లోనూ ప్రతి కుటుంబానికి ఉద్యోగాన్నిస్తానని, లేకుంటే మూడు వేల చొప్పున నిరుద్యోగ భృతిని అందిస్తానని చంద్రబాబు ప్రకటించారు. అయితే గత పాలనలో మోసం చేసిన చంద్రబాబు నేడు అధికారంలో ఉండి ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటన చేయకపోవటంతో పాత రోజులను నిరుద్యోగ యువత గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

జగన్ పాలనలో పశ్చిమలో వెయ్యికి పైగా ప్రభుత్వ కొలువులు

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ముఖ్యమంత్రి పరిపాలనలో పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన యువతకు శాశ్వత కొలువులు వచ్చాయి. ముఖ్యంగా సచివాలయాల కార్యదర్శులుగా నియోజకవర్గంలో సుమారు 750కు పైగా యువత శాశ్వత కొలువులను సంపాదించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖతో పాటుగా ఇతర రంగాలకు చెందిన మరో 200 నుంచి మూడు వందల మంది ప్రభుత్వ కొలువులు సంపాదించారు. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారు.

సూపర్ సిక్స్ కాదు..సూపర్ స్కామ్

నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు కూటమి ఇచ్చిన హామీ గతంలో మాదిరిగానే తుంగలో తొక్కారు. చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చి నెల రోజులైనా ఇంత వరకు దాని ఊసే లేదు. నమ్మి ఓట్లేసిన యువతను నిండా ముంచేశారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో వెంటనే ప్రకటించాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన మేనిఫెస్టో సూపర్ స్కామ్ అని ఇప్పుడు అర్థం అవుతుంది.

– ఎండీ గౌసీ, భవానీపురం

గతంలోనూ చంద్రబాబు మాట తప్పారు



అబద్ధాలు చెప్పటంలో చంద్రబాబు మాస్టర్ డిగ్రీ చేసినట్లున్నారు. గతంలో కూడా నిరుద్యోగులకు నెలకు రూ.2 వేలు భృతి ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పారు. అందుకేనేమో ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోను కూటమిలో భాగస్వాములైన బీజేపీ తాకలేదని అనిపిస్తుంది. చంద్రబాబు, జనసేన పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చటం కష్టమనే వాటితో మాకు సంబంధం లేదని బీజేపీ నాయకులు చెప్పినట్లు విన్నాను. ప్రజలు అమాయకులు కాబట్టే నమ్మి మోసపోయారు.

– మహమ్మద్ ఖాజా, భవానీపురం

మళ్లీ మోసం చేయాలని



గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు ప్రజలను నమ్మించాడు. ఐదేళ్లలో ఒక్కరికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇప్పుడు అదే హామీలతో గెలుపొంది మళ్లీ మోసం చేయాలని చూస్తున్నాడు. సూపర్ సిక్స్ కాదు... సూపర్ తుస్ అయ్యేలా ఉన్నాయి.

షేక్. మెహరాజ్
విజయవాడ

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) గెజిట్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఏపీ (పీఆర్‌టీయు) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో 2004 తరువాత నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను సీపీఎస్ విధానంలోనే కొనసాగించాలని అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తాము ఎన్నో సందర్భాల్లో అనేక సార్లు ధర్నాలు, పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సీపీఎస్ విధానాలను గత 20 ఏళ్ల నుంచి తాము వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేసినట్లేనని పేర్కొన్నారు. కాగా ఈ ప్రకటనను పీఆర్టీయు వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవ రాజు, రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలు జకియా సుల్తానా, పి.సత్యం సమర్థిస్తూ జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లోని ఎం.బి. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య వక్తగా మణిపాల్ హాస్పిటల్ క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు జి.కృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన లేక అనేక మంది చివర దశకు వచ్చిన తర్వాత చికిత్స లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు దీనిపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదస్సుకు హాజరై అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్



నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు నగరవాసుల 19 అర్జీలు అందించారు. ఈ సందర్భంగా మహేష మాట్లాడుతూ వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల కల్పనలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే అధికారులు వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార వేదికపై జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీఎంసీ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై -రెండు, ఇంజినీరింగ్‌పై -3, ప్రజారోగ్య విభాగంపై -5, పట్టణ ప్రణాళిక విభాగంపై- 6, రెవెన్యూ, పట్టణ సాధికార విభాగం, హౌసింగ్‌పై ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, సీపీవో ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ -1 డాక్టర్ సురేష్ బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఈఈలు పాల్గొన్నారు.

ధార్మిక ప్రవచనంకు విస్తృత ప్రచారం కల్పించాలి



సమీక్ష సమావేశంలో ఈవో రామరావు, ఏఈవోలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనాలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈవో కెఎస్.రామరావు అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే శ్రీకనకదుర్గ దేవి మహిమలపై అద్వితీయ ప్రవచనం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రవచన కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి విజయవంతం చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవచనంకు సంబంధించిన కరపత్రాలను ఇప్పటికే ముద్రించామని వాటిని భక్తులకు చేరేలా చూడాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, జంగం శ్రీనివాస్, వెంకటరెడ్డి, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ సంఘం రిజిష్టర్ నంబర్‌పై విచారణ చేయండి

మంత్రులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌కు వినతి



క్రీడా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పద్మజబాల

విజయవాడస్పోర్ట్స్: కబడ్డీ సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ 115/2010పై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ కబడ్డీ సంఘం కార్యదర్శి పి.పద్మజబాల కోరారు. ఈ మేరకు క్రీడా శాఖ మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కార్యాలయాల్లో వేర్వేరుగా సోమవారం వినతిపత్రాలు అందజేశారు. తమ సంఘం రిజిస్ట్రేషన్ నంబర్‌ను యలమంచిలి శ్రీకాంత్ కబ్జా చేసి, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్‌కు కార్యదర్శిగా కొనసాగుతున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులను, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించి అనధికారికంగా సంఘాన్ని స్వాధీనం చేసుకున్నాడని పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్రంలోని కబడ్డీ క్రీడాకారులకు తీరని నష్టం జరుగుతోందన్నారు. దీనిపై క్రీడా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి వెంటనే స్పందించి విచారణకు ఆదేశించారని, వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని శాప్ అధికారులకు సూచించినట్లు పద్మజబాల తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో కబడ్డీ సంఘం మాజీ అధ్యక్ష కార్యదర్శులు కె.ఇ.ప్రభాకర్, వీర్లంకయ్య, పలు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఉన్నారు.

కంప్యూటర్స్ రంగంలో ప్రగతి పరుగులు

ఎమ్మెల్యే సుజనాచౌదరి



సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిలింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సుజనాచౌదరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమకు లభించిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వై.సుజనాచౌదరి తెలిపారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిలింగ్ ప్రాంగణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాలు చాలా వేగవంతమైన ప్రగతిని సాధిస్తున్నాయని చెప్పారు. ఆ దిశగా కంప్యూటర్స్ విభాగంలోనూ ఊహించని రీతిలో ప్రగతి పరుగులు తీస్తుందని తెలిపారు. అందులోని ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులకు మరిన్ని సదుపాయాలను కల్పించటానికి తమ విద్యాసంస్థ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విధమైన ల్యాబ్‌లు మరింత విజ్ఞానాన్ని అందించేందుకు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఆర్యవైశ్య మహాసభ నేత పెనుగొండ సుబ్బరాయుడు, కళాశాల కోశాధికారి హరగోపాల్, ఎస్ఆర్ఎస్వీ బీఈడీ కళాశాల కార్యదర్శి మాజేటి సతీష్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం నందిగామ పట్టణానికి చెందిన కమతం వెంకటేశ్వరరావు, సరిత దంపతులు రూ.11,100లను విరాళంగా అలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

కొనసాగుతున్న టీడీపీ కక్ష సాధింపు చర్యలు



నేలమట్టమైన టీ కొట్టు, వాటర్ ట్యాంక్



టీ కొట్టు కూల్చడంతో నిరాశ్రయులైన కుటుంబం



పొక్లెయిన్‌తో బడ్డీకొట్టు తొలగిస్తున్న దృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్లో టీడీపీ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడితెచ్చి సోమవారం జోరు వర్షంలో వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మికి చెందిన వాటర్ ట్యాంక్, టీ బడ్డీని కూల్చివేయించారు. కూల్చివేతను వీర్ల వరలక్ష్మి, కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమ ఉద్యోగాలు ఉండాలంటే ఈ పనులు చేయక తప్పడంలేదని కార్పొరేషన్ సిబ్బంది పేర్కొనడం గమనార్హం. రాజీవ్‌నగర్ వాటర్ ట్యాంక్ రోడ్డులో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనేందుకు ఏర్పాటు చేసుకున్న బడ్డీలను జేసీబీతో తొలగించారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారి బడ్డీకొట్లును మాత్రమే తొలగించడంపై స్థానికులు విస్మయం వ్యక్తంచేశారు. ఆక్రమణల పేరుతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందీ లేని బడ్డీ కొట్లను తొలగించడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్నవారు ఉపాధి కోల్పోయారు.

డాక్టర్ కేల్ రావు చిరస్మరణీయుడు



కేఎల్ రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మూడుసార్లు విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా, పదేళ్లపాటు కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రిగా పని చేసి అనేక భారీ ఆనకట్టల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ కానూరు లక్ష్మణరావు (కేఎల్‌రావు) చిరస్మరణీయుడని పలువురు వక్తలు తెలిపారు. ప్రముఖ ఇంజినీర్, పద్మభూషణ్ డాక్టర్ కేఎల్ రావు జయంతి సందర్భంగా చిట్టినగర్ 47వ డివిజన్‌లో ఆయన విగ్రహం వద్ద సోమవారం నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ గంగా, కావేరి నదులను అనుసంధానం చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన మహనీయుడు కేఎల్ రావు అని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీర్ ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన వారు కావడం మనకు గర్వకారణమని చెప్పారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న కాలంలో నాగార్జునసాగర్ వంటి అనేక జలవిద్యుశ్చక్తి, నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ఆయన స్మృత్యర్థం పులిచింతల ప్రాజెక్టుకు కెఎల్ రావు ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారని, ఒక ఇంజినీర్ పేరును ప్రాజెక్ట్‌కు పెట్టడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రథమం అని పేర్కొన్నారు. విజయవాడలో కొండను తొలగింపచేసి సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి రెండు ప్రాంతాల ప్రజలకు మేలు చేసిన ఘనత కేఎల్‌రావుకే దక్కుతుందన్నారు. పోతిన పైడారావు, డి.వెంకట రమణ, వరకాల జోషి, నన్నం దుర్గ, మద్దిరాల కమలాకర్, దిద్దుకూరి శివ, కాశేశ్వరరావు తదితరులున్నారు.

సారె సమర్పించిన 43 భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం 43 బృందాలు ఆషాఢ సారెను సమర్పించాయి. నూజివీడుకు చెందిన దుర్గ బృందంకు చెందిన 35 మంది, గుంటూరుకు చెందిన బాలాజీ సేవా బృందంకు చెందిన 50 మంది, సాయినంద భక్తి బృందంకు చెందిన 60 మంది, ఉండవల్లి సెంటర్‌కు చెందిన టి.శ్రీలక్ష్మీ బృందంకు చెందిన 50 మంది, శ్రీమారుతీ లలితా మండలికి చెందిన 40 మంది, శ్రీరామ భక్త బృందంకు చెందిన 35 మంది, సింగ్‌నగర్‌కు చెందిన కె. మల్లికార్జునరావు బృందంకు చెందిన 45 మంది, రామకృష్ణ కోలాట సంఘంకు చెందిన మరో 30 మంది, గుడివాడకు చెందిన మురళీకృష్ణ కోలాట బృందంకు చెందిన 45 మందితో పాటు విజయవాడలోని వన్‌టౌన్, సత్యనారాయణపురం, విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి.

క్రీడా సంఘాల ప్రక్షాళన స్వాగతిస్తున్నా

కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో అస్తవ్యవస్తంగా ఉన్న క్రీడా సంఘాలను ప్రక్షాళన చేసే అంశాన్ని తాను స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కె.పి.రావు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా సంఘాలను ప్రక్షాళన చేయాలని తాను 2018 నుంచి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అనేక వినతిపత్రాలను ఇచ్చానని, 2019 నుంచి 2024 వరకు సీఎంగా ఉన్న వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి వినతిపత్రాలు ఇచ్చానని, తాజాగా ఇటీవలే సీఎం చంద్రబాబుకు వినతిపత్రాలు ఇచ్చానని చెప్పారు. అయితే కబడ్డీ సంఘం కార్యదర్శి వై.శ్రీకాంత్, జూడో సంఘం ప్రతినిధి నామిశెట్టి వెంకట్, అథ్లెటిక్ సంఘం మాజీ కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు తనపై ఈ నెల 14వ తేదీన విలేకరుల సమావేశంలో చేసిన అవినీతి ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. 2019లో తాను ఒలింపిక్ సంఘానికి పలు క్రీడా సంఘాల మద్దతులో కార్యదర్శిగా నియమితుడయ్యానన్నారు. 2014 నుంచి ఒలింపిక్ సంఘంలో కొనసాగుతున్న వివాదాల దృష్ట్యా సంఘానికి చెందిన అకౌంట్స్ లావాదేవీలను నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ 2017లో ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. తాను కార్యదర్శిగా ఎన్నిక కాకముందే న్యాయస్థానం ఆదేశాలతో అకౌంట్స్ మొత్తం నిలిచిపోయాయని, ఈ నేపథ్యంలో తాను సంఘం ఖాతాల నుంచి నగదు ఎలా విత్‌డ్రా చేస్తానని ప్రశ్నించారు. శ్రీకాంత్, నామిశెట్టి వెంకట్, ఆకుల రాఘవేంద్రరావులు తనపై దురుద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై సీఐడీకి ఫిర్యాదు చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తానే తనపై విచారణ చేయాలని సీఐడీని కోరతానన్నారు. అదేవిధంగా ఆ ముగ్గురు వ్యక్తులు వారిపై సీఐడీ విచారణ చేయాలని కోరాలని సూచించారు. రాష్ట్ర క్రీడా సంఘాల్లో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.